

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
శుక్రవారం 07 నవంబర్ 2025 - పేజీలు 9




### వివిఐటియు బాలోత్సవ్‌కు
## సర్వం సిద్ధం

**గుంటూరు, విద్య మేజర్ న్యూస్:** ప్రపంచ తెలుగు బాలల పండుగ వివిఐటియు బాలోత్సవ్ 2025 సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి ప్రాంగణం పూర్తిగా సిద్ధమైనది. ప్రఖ్యాతిగాంచిన వివిఐటియు బాలోత్సవ్ వేడుకలలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాలల నుండి 13000 మంది విద్యార్థులు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. 20 అంశాలు, 61 విభాగాలలో

వివరాలు 2 లో



### గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే ఆదేశాలు
## బేఖాతరు..!

- గుంటూరు పశ్చిమ సహాయ నిరాకరణ పై.. సీఎం చంద్రబాబుకు గల్లా మాధవి ఫిర్యాదు..?
- మసకబారుతున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి ప్రతిష్ట
- అవమానం అసహనంతో అధికారుల తీరుపై చిందులు

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** రచ్చ గెలిచిన ఇంట గెలవలేక గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అవమాన భారంతో కృంగిపోతున్నారు. ఓవైపు పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సీనియర్ నాయకురాలు సహాయ నిరాకరణ కొనసాగుతుండడం.., మరోవైపు ప్రోటోకాల్ ను ఉల్లంఘించి అధికారులు నియోజకవర్గ ప్రజలకు డమ్మీ ఎమ్మెల్యేగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుండడం ఆమె నిస్సహాస్థితికి అడ్డం పడుతోంది. అనుక్షణం ఏదో ఒక కోణంలో పార్టీ సీనియర్ నాయకులు, సీఎం సామాజిక వర్గానికి చెందిన నాయకులు పెత్తనం చెలాయించే ప్రయత్నం చేస్తుండడం పట్ల ఆమె నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ

2 లో



### ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో
## ఫుడ్ పాయిజన్

### ఘటనపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హా విచారణ

**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి మండలం నీరుకొండ పరిధి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హాస్టల్‌లో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై గుంటూరు జిల్లా సబ్ కలెక్టర్ సంజనా సిన్హా గురువారం విచారణ చేపట్టారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలోని మెస్ ను, పరిసరాలను తనిఖీ చేశారు. ఫుడ్ పాయిజన్ కు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మంగళగిరి తహసిల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 300 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైనట్లు విచారణలో వెల్లడైందని ఆమె తెలిపారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై వాస్తవాలను నిర్ధారించి, చర్యలకు ఉపక్రమించేందుకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. తెనాలి సబ్ కలెక్టర్, ఎడ్యుకేషన్ ఆర్జెడి, డీఎస్ఓ, ఫుడ్ ఇన్స్పెక్టర్, డి.ఎస్.పి

2 లో

### బోయపాలెం డైట్‌లో ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుకు
## నకిలీ పత్రాలతో హాజరైన అభ్యర్థి

### చివరి నిమిషంలో అడ్డుకున్న పల్నాడు డిఈఓ చంద్రకళ

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు బోయపాలెం డైట్ ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుల రాత పరీక్ష కు గుంటూరు జిల్లా కేంద్రములో ని పరీక్ష సెంటర్ లో అక్రమ ప్రవేశాన్ని డైట్ ప్రిన్సిపాల్ పల్నాడు విద్యాశాఖధికారిని చంద్రకళ ఆఖరి నిమిషంలో అడ్డుకోవటం అభినదనీయం. వివరాల్లోకి వెళితే పల్నాడు జిల్లాలోని నూజెండ్ల మండలం ములకలూరులో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లోని స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పోస్టుకు ఖాళీలు ఏర్పడ్డాయి. బోయపాలెం డైట్ లో ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుల (డెప్యూటేషన్) రాత పరీక్ష అర్హాత సాధించుటకు అర్హాత లేకపోయినా కమిషనర్ కార్యాలయంలోని ఇద్దరు ఉన్నత అధికారులు సహాయంతో పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న ఉప విద్యాశాఖధికారి చక్రం తిప్పి హాల్ టికెట్ ని అక్రమంగా సంపాదించి సదరు అభ్యర్థికి 9 గంటలకు పరీక్ష సెంటర్ కి చేరుకున్న తరుణంలో ప్రిన్సిపాల్, పల్నాడు జిల్లా విద్యాసాహాధికారిణి చాక చక్యంగా ఆపివేసి మిగతా అభ్యరదులకు న్యాయం చేసారు. ఈ విషయం లో అక్రమర్కులను విచారించి తగు చర్యలు కమీషనర్ తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

### ఎస్సైతోపాటు ముగ్గురు సిబ్బందిపై
## సస్పెన్షన్ వేటు

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన 4 గురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో ఒక ఎస్సై స్థాయి అధికారితో పాటు ముగ్గురు సిబ్బంది ఉన్నారు. పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా క్రమశిక్షణా రాహిత్య చర్యలు లేదా అధికార దుర్వినియోగానికి పాల్పడిన పోలీసులను ఎవరైనా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, సంబంధితులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనిచేస్తున్న షేక్ సలాం, మరియు హెడ్ కానిస్టేబుల్ బి రమేష్ తమ అధికారిక విధుల్లో ప్రైవేట్ వ్యక్తుల జోక్యాన్ని అనుమతించి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలింది. అదే విధంగా పెదకాకాని పోలీస్ స్టేషన్ లో విధులు

మిగతా 2 లో..

### ఆప్కోలోని స్టాక్‌తో

- –ఆప్కో గోడౌన్ లో రూ.15 కోట్ల వస్త్రాల స్టాక్
- –ఉనికి కోసం జగన్ డ్రామాలు
- –రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



## నూతన డిజైన్లు

**మంగళగిరి, మేజర్ న్యూస్:** చేనేత వస్త్రాల స్టాక్ తో కొత్త డిజైన్లతో చిన్న పిల్లల ఫ్రాగ్ లు, రెడీమేడ్ చీరలు, పంచెలు క్యారీ బ్యాగ్ లు తయారు చేసి కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరలోని యర్రబాలెం ఆప్కో గోడౌన్ ను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాతో కలిసి మంత్రి సవిత గురువారం పరిశీలించారు. గోడౌన్ లో ఉన్న స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.15 కోట్ల విలువైన వస్త్రాలు గోడౌన్ లో ఉన్నట్లు ఆప్కో మేనేజర్ మనోజ్ కుమార్ తెలిపారు. 96 ఆప్కో షో రూమ్ లకు గానూ 93 షో రూమ్ ల నుంచి రూ.13.48 కోట్లకుపై గా స్టాక్ వెనక్కి తెప్పించామని మిగిలిన మూడు షో రూమ్ ల నుంచి త్వరలోనే స్టాక్ రానుందని ఆయన తెలిపారు. గోడౌన్ లో ఉన్న రూ.కోటీ 60 లక్షల మేర స్టాక్ తో కలిపి రూ.15 కోట్లకు పైగా విలువైన వస్త్రాలు ఉన్నాయన్నారు. స్టాక్ వస్త్రాలను పరిశీలించిన మంత్రి సవిత... ఆ దుస్తులను గ్రేడింగ్ గా విభజించి, డ్యామేజీ కాని వస్త్రాలను రీ సేల్ కు పంపాలని ఆదేశించారు.

2 లో

# సమన్వయంతో పని చేద్దాం.. సామాజిక రుగ్మతలను రూపుమాపుదాం



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** సమన్వయంతో పని చేసి జిల్లాలో సామాజిక రుగ్మతలను రూపుమాపుదామని స్వచ్ఛంద సంస్థలకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చెత్త కుప్పలు, కాలువ గట్లు, మురుగు కాలువలు తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర సామగ్రిని సేకరించే చిన్నారులు ఉన్నట్లు గమనించటం జరిగిందన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు ఉండే అవకాశం ఉందని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి రూపుమాపాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు బ్రహ్మాండమైన పనులు చేస్తున్నాయని ప్రశంసించారు. స్వచ్ఛంద సంస్థలు వివిధ రంగాల్లో పని చేయడం గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో సామాజిక రుగ్మతలపై సమరం సాగించి జిల్లాను ఆదర్శంగా తీర్చిద్దడంలో భాగస్వామ్యం కావాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి శేష శ్రీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ పి.ఆర్.సి రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఫుడ్ పాయిజన్ ఘటనపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హా విచారణ

మొదటి పేజీ తరువాయి

తో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో కొంత మందికి డయేరియా లక్షణాలు, మరికొందరికి వాంతులు, విరోచనాలు, కడుపులో నొప్పి ఉన్నట్లు వైద్య బృందాలు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ ఘటనకు కారణం ఏమిటి అన్నది ఖచ్చితంగా తెలుసుకునేందుకు పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందన్నారు. సిఆర్డిఏ పరిధిలోని గ్రామాల నుంచి సరఫరా అవుతున్న తాగునీటి వలన సమస్య తలెత్తిందా? లేక ఆహార కలుషితమం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురి అయ్యారా? అనే కోణంలో కూడా విచారిస్తున్నామన్నారు. ఆహార పదార్థాలు వండేందుకు వినియోగిస్తున్న నీరు, త్రాగు నీరు శాంపిల్స్ ను సేకరించి ప్రయోగశాల కు పంపినట్లు చెప్పారు. వీటిలో ఎక్కడ లోపం తలెత్తిందో గుర్తించే పనిలో కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారని ఆమె పేర్కొన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులకు ఆర్వో వాటర్‌నే సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారని వివరించారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని అన్నారు. పూర్తి నివేదిక అందిన వెంటనే నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు సబ్ కలెక్టర్ సంజనా సిన్హా స్పష్టం చేశారు.

# ఆప్కోలోని స్టాక్‌తో నూతన డిజైన్లు

మొదటి పేజీ తరువాయి

అవసరమైతే, సబ్సిడీ ధరలపై విక్రయించాలని స్పష్టంచేశారు. ఏయే జిల్లాల నుంచి ఎంతెంత మేర స్టాక్ వెనక్కి తెప్పించారని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన షో రూమ్ ల నుంచి త్వరగా స్టాక్ తెప్పించాలని స్పష్టం చేశారు. గోదాములో ఉన్న స్టాక్ తో చిన్నపిల్లల ఫ్రాగ్ లు, రెడీమేడ్ చీరలు, పంచెలు, క్యారీ బ్యాగ్ ల తయారీని మంత్రి సవిత పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆప్కో గోడౌన్ లో రూ.15 కోట్ల మేర స్టాక్ ఉందన్నారు.

**ఉనికి కోసం జగన్ డ్రామాలు...**

రాజకీయ ఉనికి కోసం జగన్ డ్రామాలు ఆడుతున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. అధికారంలో ఉన్నన్నాళ్లు ఏరోజూ రైతులు, బీసీల గురించి ఆలోచించే పాపాన పోలేదన్నారు. అయిదేళ్ల పాలనలో ఏనాడూ బురదలోకిగాని, నీటమునిగిన పొలాల్లోకిగాని దిగి తుఫాన్ బాధితులను పరామర్శించిన దాఖాలాల్లేవన్నారు. ఇప్పుడు కూడా తుఫాన్ వెళ్లిపోయిన వారం రోజుల తరవాత తీరిగ్గా వచ్చి రైతులను ఓదార్చే డ్రామాకు తెరతీశాడన్నారు. బీసీలను తీవ్రంగా వేధించిన వ్యక్తి జగన్ రెడ్డి అని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ అసమర్థ పాలనను విమర్శించినందుకు ఎందరో బీసీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి, జైళ్లో అక్రమంగా బంధించాడన్నారు. జోగి రమేష్ అరెస్టుతో జగన్ కు బీసీలు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. కల్తీ మద్యం తయారీలో జోగి రమేష్ పాత్ర ఉన్నట్లు ఆ కేసులు ఏ1 నిందితుడిగా ఉన్న జనార్దనరావు పోలీసులకు తెలిపాడన్నారు. తాను, జనార్ధనరావు ఫ్యామిలీ ఫ్రెండ్స్ అని జోగి రమేష్ చెబుతున్నాడన్నారు. జనార్దనరావుకు, జోగి రమేష్ కు సంబంధమే లేదని జగన్ అంటున్నాడని, వారిద్దరిలో ఎవరి మాట జనాలు నమ్మాలని మంత్రి సవిత ప్రశ్నించారు. బీసీ కార్డుతో జగన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని, ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితుల్లోకి లేరని మంత్రి సవిత అన్నారు.

# వివిఐటియు బాలోత్సవ్‌కు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

పోటీలు నిర్వహించే బాలోత్సవ్ కు వివిఐటియు ప్రాంగణం నందు 32 వేదికలను ఏర్పాటు చేసారు. ఇతర రాష్ట్రాలు, దూరప్రాంతాల నుండి విచ్చేయు విద్యార్థులకు మార్గనిర్దేశం కొరకు గుంటూరు మరియు విజయవాడ నగరాలలోని బస్టాండు, రైల్వే స్టేషన్ నందు సేవా కేంద్రాలను ఏర్పాటుచేసి యూనివర్శిటికి చెందిన బస్సుల ద్వారా బాలోత్సవ్ ప్రాంగణానికి తరలించటం జరుగుతున్నది. ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ లు సమాచారం కొరకు డా॥ పుట్టా నాగేశ్వరరావు- 9949001586 నెంబరుకు సంప్రదించాల్సిందిగా కోరటమైనది. వసతికొరకు ఇప్పటివరకు 1900 మంది బాలురు, 2800 మంది బాలికలు నమోదు చేసుకోగా అదనంగా 1500 మందికి వసతిని ఏర్పాటుచేసేందుకు బాలోత్సవ కమిటి సన్నద్ధంగా ఉన్నది. వసతిని వినియోగించుకొనే విద్యార్థులు దిందు, దుప్పటులు, జనరల్ మెడిసిన్స్ తమ వెంట తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేసారు. వసతి కొరకు 7386225336 నెంబరును సంప్రదించాలి. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన విద్యార్థుల కొరకు వివిఐటి యూనివర్శిటికి చెందిన బస్సులు ఈరెండు జిల్లాలలో 43 రూట్లలలో అందుబాటులో ఉండగా వాటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. పోటీలలో పాల్గొనేందుకు బాలోత్సవ్ ప్రాంగణానికి చేరుకున్న విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు ఉచిత వసతి మరియు భోజనం సౌకర్యాలను అందచేయనున్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులైన నిపుణులను న్యాయనిర్ణేతలుగా నియమించి పోటీలలో పాల్గొనే విద్యార్థులకు తగు సూచనలు అందించటం జరుగుతుంది. బాలోత్సవ్ ప్రాంగణం నందు వివిఐటి యూనివర్శిటికి చెందిన స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 600 మంది ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు బాలోత్సవ్కు విచ్చేసిన వారికి అవసరమైన సేవ కార్యక్రమాలను అందిస్తారు. 180 మంది ఎన్.సి.సి విద్యార్థులు రక్షణ, భద్రత కొరకు కేటాయించడం జరిగినదని తెలిపారు. వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్న నేపథ్యంలో ప్రాథమిక చికిత్స కొరకు పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ క్యాంపును నిర్వహించనున్నది. గుంటూరు కిమ్స్, శ్రేష్ట హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్యకేంద్రం మరియు ఆధునిక అంబులెన్స్ లను ఏర్పాటు చేస్తున్నారు. పోటీలలో విజేతలుగా నిలిచినవారికి బహుమతులుగా కొండపల్లి విశిష్ట జోడుఎడ్ల బొమ్మలను అందించనున్నట్లు వి వి ఐ టి విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.

# ఎస్సైతోపాటు ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి



నిర్వహిస్తున్న కానిస్టేబుల్ %దీ%. సురేష్ కుమార్ మరియు హోంగార్డు హరీష్ బహిరంగ మద్యపానం చేస్తున్న వ్యక్తుల వద్ద నుండి రూ.3 వేలు డిమాండ్ చేసి తీసుకున్నట్లు విచారణలో తేలింది. అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించి, వారిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజాసేవ అనే విలువలకు ప్రథమ స్థానం ఇచ్చి ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లాలో పనిచేస్తున్న ప్రతి ఒక్క పోలీస్ అధికారి మరియు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు.

# గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

మొదటి పేజీ తరువాయి

వ్యాపార కుటుంబంలో ఉండడంతో అన్ని వర్గాల ప్రజలతో ఎలా మెలిగాలో కొత్త గొప్పో అవగాహన పెంచుకున్నప్పటికీ ఆమె నాయకత్వాన్ని పార్టీ సీనియర్లు అంగీకరించడం లేదు. నియోజకవర్గ పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలలోనూ గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేరు పార్టీ నేతలు అధికారులు ద్వితీయ శ్రేణి నాయకులు జపిస్తుండడం ఆమెకు అస్సలు. అయినప్పటికీ తాను సైతం ఎంపీ పెమ్మసానితో ఉన్నానని చెప్పుకోవడానికి గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆమెను దూరంగా ఉంచుతున్న పరిస్థితులు కూటమి ప్రభుత్వంలోని కార్యకర్తలను విస్మయానికి గురిచేస్తోంది. బీసీ మహిళగా ఒంటి చేత్తో ఎన్నికలనే కథనరంగంలో భర్త సహకారంతో పార్టీ జెండాను పట్టుకొని పెద్దలు, బీసీ ఓటర్ల ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయ కేతనం ఎగురవేశారు. ఈ ఆనందాన్ని సంవత్సరం కూడా గడవకముందే ఆవిరి చేసేందుకు సొంత పార్టీ నేతలే కుయుక్తులు పన్నుతుండడం కొసమెరుపు...

**మసకబారుతున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి ప్రతిష్ట..**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఓటర్ల గణాంకాల పరంగా బీసీలు మెజార్టీగా ఉన్నప్పటికీ పెత్తనం అంతా రాష్ట్ర సీఎం చంద్రబాబు సామాజిక వర్గానిదే. ఎమ్మెల్యేగా తొలిసారిగా గెలువ గెలవడం, రాజకీయ పరిజ్ఞానం పెద్దగా లేకపోవడం, పార్టీలో జూనియర్ స్థాయిలో ఉండడంతో సీనియర్ నేతలు, సీనియర్ కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, మేయర్ తో పాటు పార్టీ నేతలు, మంత్రులు చెప్పినట్టే వినాల్సి వస్తుంది. దీంతో కొద్దికాలంలోనే దమ్మీ ఎమ్మెల్యేగా స్టాంప్ వేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గుంటూరు నగరపాలక సంస్థలో కార్పొరేటర్ గా ఉన్న కోవెలమూడి రవీంద్ర(నాని) కాలం కలిసి రావడంతో తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చాక మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఆయన పలుమార్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును ఆశించారు. సీటు తక్కకపోయినా క్రియర్గా గెలవడంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పై పెత్తనం చలాయిస్తున్నారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోపక్క గుంటూరు పార్లమెంటు అభ్యర్థిగా గెలిచిన కోటీశ్వరుడైన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన కార్యాలయం గుంటూరు పశ్చిమ లోనే ఉంది. సదరు ఎంపీకి సీఎం చంద్రబాబు దగ్గర పరపతి ఎక్కువగా ఉండటంతో గుంటూరు జిల్లా అంతట ఆయన చెప్పిందే వేదంగా నడుస్తుంది. దీంతో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేకు ప్రాధాన్యత ఉండడం లేదు. పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి పనికి ఎమ్మెల్యేని కాదని ఎంపీ గడప తొక్కుతుండడంతో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి ప్రతిష్ట మసకబారుతోంది.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రారంభమైన కలహాలను, స్థానిక మహిళ ఎమ్మెల్యేగా ఉన్న తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని, సహాయ నిరాకరణను, దూరం పెడుతున్న అంశాలపై అధిష్టానానికి కంప్లైంట్ చేస్తానని, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని గతంలోని కూటమి అభ్యర్థిగా గెలిచిన ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రకటించి ఉన్నారు. ఇప్పటికే ఫిర్యాదు చేశారా లేదో తెలియదు కానీ మహిళ ఎమ్మెల్యేగా టిడిపి తరఫున గెలిచిన ఆమెకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు సొంత సామాజిక వర్గం నేతలు కూడా ముందుకు రాకపోవడం శోచనీయం. ఏది ఏమైనప్పటికీ ఏడాది నా కాలంలోనే గుంటూరు జిల్లాలో ఏకైక తెలుగుదేశం పార్టీ మహిళా ఎమ్మెల్యే గా ఉన్న గల్లా మాధవి పరిస్థితిని అర్థం చేసుకొని పార్టీపరంగా ఆమెకు మంచి భవిష్యత్తు ఉండేలా, మంచి నాయకత్వ పటిమ అలవాడేలా, పార్టీ అధిష్టానం దిశ నిర్దేశం చేస్తే గుంటూరులో ఫైర్ బ్రాండ్ మహిళా ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన డాక్టర్ శనక్కాయల అరుణ లా మరింతకాలం పార్టీకి సేవకురాలిలా గళ్ళ మాధవి సేవలందించే అవకాశం లేకపోలేదు.

**ఎమ్మెల్యే ఆదేశాలను ఖాతరు చేయని అధికారులు...**

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే ఆదేశాలను నియోజకవర్గ స్థాయి అధికారులతో పాటు గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు కూడా ఖాతరు చేయడం లేదని ఎమ్మెల్యే గల్లా మాధవి బాహాటంగానే వాపోతోంది. తన నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించడం లేదని, నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడంలేదని, పలు కార్యక్రమాల సందర్భంగా వేసిన ఫ్లెక్సీలలో అధినేతల ఫోటోలు వేయకుండా తనను గర్విష్టి ఎమ్మెల్యేగా, రాజకీయ పరిజ్ఞానం లేని ఎమ్మెల్యేగా పార్టీని పట్టించుకోని ఎమ్మెల్యేగా పార్టీలోనిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని పత్రిక ముఖంగానే వాపోతున్నారు. పలు కార్యక్రమాలు తన ప్రమేయం లేకుండానే జరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ మాఫియాని అరికట్టాలని, పశ్చిమ నియోజక వర్గంలో అధిక మొత్తంలో పేదలు బడుగు బలహీన వర్గాలు ఉన్నారని వారి అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని చెబుతున్నప్పటికీ జిల్లా అధికారులు, మండల డివిజన్ అధికారులు పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై సమీక్ష సమావేశంలోనే అసహనం వ్యక్తం చేశారు. గత ఏడాది నవంబర్ 23వ తేదీన జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో స్వయంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జోక్యం చేసుకొని ప్రోటోకాల్ రగడపై సహనం పాటించాలని, మరో మారు అటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అప్పటి కలెక్టర్ నాగలక్ష్మి కి ఆదేశించిన సంఘటనకు, ప్రస్తుతం ఎమ్మెల్యేగా జరుగుతున్న అవమానాన్ని చూస్తుంటే తెలుగుదేశం పార్టీ నాయకుల మాటలు పేపర్ ల మీద రాతలకే తప్ప ఆచరించడానికి కాదని ఇట్టే అర్థం అవుతుంది. తనకు జరుగుతున్న అవమానం భరించలేనని, తనను ఎవరూ పట్టించుకోవడం లేదని, అధికారులు తీరుపై చిందులేసిన పశ్చిమ ఎమ్మెల్యే మాధవి లా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎంతమంది ఉన్నారో... ఎంతమంది భవిష్యత్తులో బయటకు వస్తారో వేచి చూడాల్సి ఉంది.

# ధాన్యం కొనుగోలు ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలి




**గుంటూరు కలెక్టరేట్ మెజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలు ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. పొన్నూరు మండల కేంద్రంలో లయన్స్ పోలీ సర్వీస్ సెంటర్ లో ఖరీఫ్ 2025 - 26 కాలానికి ధాన్యం కొనుగోలు శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో ధాన్యం నాణ్యత ప్రమాణాల మీద శ్రద్ధ వహించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్స్ ఈ విషయములో చాల జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ధాన్యం తేమ శాతం నిర్దిష్ట ప్రమాణాలలో ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతు సేవ కేంద్రం వద్ద నియమించిన టెక్నికల్ అసిస్టెంట్, ధాన్యం తేమ శాతం జాగ్రత్తగా పరిశీలించాలని తద్వారా కొనుగోలు సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అన్ని మాయిశ్చర్ మీటర్లు సక్రమంగా క్యాలిబ్రేషన్ చేయించుకుని అన్ని విధాలుగా సంసిద్ధముగా ఉండాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనే సంచులు ముందస్తుగానే రైతు సేవ కేంద్రాలలో ఏర్పాటు చేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఈ సంవత్సరం ప్రారంభించిన ఇ -బ్యాంకు గ్యారంటీ పద్ధతిని దృష్టిలో పెట్టుకుని, వీలయినంత త్వరగా ఇ-బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని చెప్పారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు తమ పాత్రను సమర్ధంగా నిర్వహించాలని, రైతులకు పూర్తిగా అండగా ఉండాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కార్యకలాపాలలో, జి.పి.ఎస్ అమర్చిన వాహనాలు మాత్రమే ధాన్యం రవాణా కోసం ఉపయోగించాలని తెలిపారు. ఈ వాహనాల వివరాలను ముందస్తుగా పోర్టల్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, జి.పి.ఎస్ అమర్చిన వాహనాల వివరాలను సేకరించాలని ఆదేశించారు. జి.పి.ఎస్ అమర్చిన వాహనాలను సక్రమంగా ఉపయోగించి, రవాణా ప్రక్రియను సులభతరం చేసి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగ మంతా సమన్వయముతో కృషి చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.తులసి మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్స్ కు ధాన్యం సేకరణ విధానాన్ని, దానిలోని మెళకువలు వివరించారు. ధాన్యం తేమ శాతం చూసే విధానంపై అవగాహన కల్పించారు. తేమ శాతం కొలిచే కప్ వాడకాన్ని, దానికి అవసరమైన ప్రెషర్ ఎంత ఇవ్వాలో వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమములో, ధాన్యం నాణ్యతా పరిశీలన, తేమ శాత నిర్ధారణ గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆన్లైన్ ప్రొక్యూర్మెంట్ పోర్టల్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వివిధ స్థాయిల్లో ఎంట్రీ చేయనున్న సిబ్బందికి టి.సి.ఎస్ నుండి వచ్చిన సాంకేతిక సహాయకుడు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పొన్నూరులో కుమార్ రైస్ మిల్లును సందర్శించి, మిల్లింగ్ సామర్థ్యం, ఆరబెట్టు సదుపాయం, బ్లెండింగ్ మిషనరీ, ఆరబెట్టడానికి ఓపెన్ ప్లాట్ఫాం, నాణ్యత నియంత్రణ చర్యలు, స్టాక్ సంరక్షణ, ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ లైసెన్స్, ఇతర అనుమతుల పై వివరాలు పరిశీలించారు. మిల్లర్లు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో జి.డి.సి.ఎం.ఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, పొన్నూరు, చేబ్రోలు మండలాల తాసిల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, కస్టోడియన్ అధికారులు, వి.ఏ.ఏ.లు, టెక్నికల్ అసిస్టెంట్స్, డి.ఇ.ఓ లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండాలి

**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్నారు. ఓటరు జాబితా పునశ్చరణపై గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ను సి.ఇ.ఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా ఓటర్ల సర్వే విచారణ జరపాలన్నారు. బి ఎల్ ఓ లు ఇంటింటా సర్వే చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బుక్ కాల్ విత్ బి.ఎల్.ఓ అవకాశాన్ని తీసుకురావడం జరిగిందని తద్వారా ఓటరు జాబితాలో సమస్యలను పరిష్కరించుటకు అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్ లు విజయ లక్ష్మి, గంగరాజు పాల్గొన్నారు.

## తాడేపల్లి, మంగళగిరి సెక్రటరీగా దావులూరి



**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి పురపాలక సంఘంలో శానిటరీ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న దావులూరి శ్రీనివాసరావు మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ సెక్రటరీగా పదోన్నతి పొందారు. తెనాలి చెందిన దావూరి శ్రీనివాసరావు తెనాలి పురపాల సంఘం లో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఉన్నారు. రాష్ట్ర పుర పరిపాలన శాఖ ఇటీవల నిర్వహించిన పదోన్నతులలో థర్డ్ గ్రేడ్ కమిషనర్ హోదాలో సెక్రటరీగా దావులూరిని నియమిస్తూ గురువారం మున్సిపల్ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు అందజేశారు. దావులూరి పదోన్నతి పొందడం పట్ల పురపాలక సంఘ అధికారులు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

# విద్యార్థులు ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే గుణాన్ని అలవర్చుకోవాలి




**సినీ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు**

**తెనాలి, మేజర్ న్యూస్ :** విద్యార్థులు ఎదిగినకొద్ది ఒదిగి ఉండే గుణాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు పేర్కొన్నారు. స్థానిక బుర్రపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆడిటోరియంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ లో జిల్లాస్థాయికి ఎంపిక కాబడిన విద్యార్థుల అభినందన సభను గురువారం నిర్వహించారు. సభకు సినీ సంగీత దర్శకులు సాలూరి వాసు రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్ లో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైన వివేక టాలెంట్ స్కూల్ విద్యార్థులు వర్షిని, జుబేరియా, పూజ ,నాగ శ్రావ్య లను ఆయన అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాసు రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యనభ్యసించాలని, తమ ప్రగతికి కృషిచేసిన గురువులను జీవితాంతం గుర్తుంచుకోవాలని అన్నారు. చదువుతోపాటు సంగీతం, నృత్యం వంటి వాటిలో కూడా ప్రతిభను చాటాలని ఆయన కోరారు. పేద కుటుంబంలో జన్మించిన తన తండ్రి సాలూరి రాజేశ్వరరావు తన సంగీత ప్రతిభతో తెలుగువారి మనసు గెలుచుకున్నారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని తాను ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమరావతి జోన్ రోటరీ క్లబ్ కార్యదర్శి గుత్తా వెంకటరత్నం, జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, శ్రీమన్నా రాయణ శాస్త్రి, బొల్లి ముంత కృష్ణ ,మురళి, రాంబాబు, ప్రిన్సిపాల్ శంకర్, శివకుమార్, రావిపాటి వీరనారాయణ, డాక్టర్ రామరాజు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కుష్టువ్యాధిని ముందస్తు గానే గుర్తించవచ్చు

**తెనాలి, మేజర్ న్యూస్ :** కుష్టు వ్యాధిని ముందస్తుగానే గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని డిప్యూటీ పార మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట లోని మెప్మా కార్యాలయంలో గురువారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ నెల 17వ తారీకు నుండి డిసెంబరు 3 వ తారీకు వరకు జరుగు లేప్రెసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ప్రోగ్రాం ను పురస్కరించుకొని కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెనాలి డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి పూర్వ జన్మలో చేసుకున్న శాపము లేక పాపము కాదని ఒక సాధారణ వ్యాధి అని అన్నారు. కుష్టు వ్యాధి ఒక చర్మవ్యాధి అని ఏ వయసు వారికైనా రావచ్చని ఎవరి శరీరము పైన అయినా స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, ఉబ్బినటువంటి నొప్పితో కూడిన పెరిఫెరల్ నర్వ్ లు మరియు కండరముల బలహీనత ఇటువంటి లక్షణాలు ఉంటే అప్పుడు దానిని కుష్టువ్యాధిగా అనుమానించవచ్చు అని అన్నారు . కుష్టు వ్యాధిని అశ్రద్ధ చేస్తే తీవ్ర పరిణామాలు, ఎదుర్కోవాల్సి వస్తుందని, త్వరగా కనుగొని వెంటనే చికిత్స చేయించుట ద్వారా కుష్టి వ్యాధిని నూటికి నూరు శాతం పూర్తిగా నయం చేయవచ్చు అని అన్నారు . ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడువచ్చుని,కుష్టు వ్యాధి కి తెనాలిపట్టణ పరిధిలోని అన్ని సచివాలయములలో ఉన్న ఆరోగ్య కార్యదర్శులు మరియు ఆశా కార్యకర్తల ద్వారా మరియు అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా ఉచితంగా మందులు అందించబడతాయని తెలిపారు. వ్యాధిగ్రస్తులను చాలా గోప్యంగా ఉంచుతామని, వారి గృహమునకే వెళ్లి వైద్యం అందించి వారికి తగిన సలహాలు ఇస్తామని, శరీరముపై ఎటువంటి మచ్చలు వచ్చినా ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు. మెప్మా సిఎంఎం విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ సూపర్వైజర్ బండారు మల్లేశ్వరరావు ,లెప్రా సోసైటీ సూపర్వైజర్ రమణ, ఎనిమిదవ సచివాలయ ఆరోగ్య కార్యదర్శి చెన్ను చంద్రమ్మ , హెల్త్ అసిస్టెంట్ అలా వేణుగోపాల రావు, ఆశాకార్యకర్త దాసరి వీణ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తెనాలి పట్టణ పరిధిలో ఉన్న 70 మంది రిసోర్స్ పర్సన్సలకు శిక్షణ ఇచ్చారు.

# పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ పంపిణీ



**తెనాలి, మేజర్ న్యూస్ :** మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం యూనిఫామ్ పంపిణీ చేశారు. పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా షెడ్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, మున్సిపల్ కమీషనర్ రామా అప్పల నాయుడు పాల్గొని పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రాధికా రమేష్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమైనదని, వారి సేవలను ఎప్పుడు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వారికి అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించే విషయంలో పురపాలక సంఘం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. కమీషనర్ రామా అప్పల నాయుడు మాట్లాడుతూ నిత్యం కష్టపడే పని చేసే కార్మికుల అవసరాలను పురపాలక సంఘం గుర్తిస్తుందని, వారికి అవసరమైన చెప్పులు, కొబ్బరి నూనె, యూనిఫామ్ వంటివి సకాలంలో అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తిరుమల శెట్టి ప్రసాద్, మల్లోల సుబ్బారావు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తుఫాన్‌తో దెబ్బతిన్న రైతులను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**సిపిఎం, రైతు సంఘాలు**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు రూరల్ జొన్నలగడ్డ గ్రామంలో దెబ్బతిన్న పత్తిపైరులను సిపిఎం, రైతు సంఘాలు గురువారం పర్యటించడం జరిగింది . ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, కంచుమాటి అజయ్ కుమార్ లు మాట్లాడుతూ తుఫానుకు ముందు ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రులు తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకుంటామని ఆర్భాటంగా పత్రికల్లో, టీవీల్లో ప్రచారం ఉదరగొట్టారన్నారు. కానీ ఆచరణలో శూన్యంగా ఉందన్నారు. జిల్లాలో సుమారు 60 ఎకరాలు పత్తి సాగు చేయగా అందులో సగం పైగా పూర్తిగా పత్తి దెబ్బ తిన్నది అన్నారు. కానీ పంట నష్టం అంచనాల్లో ఏమాత్రం దెబ్బతిన్న ఫైర్లను పరిశీలించకుండా మొక్కుబడిగా హడావుడిగా తప్పుడు రిపోర్టులతో పంట నష్టం తయారు చేయడం జరిగింది. గ్రామంలో క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేసిన దాఖలాలు లేవన్నారు. పత్తి ఊరకెత్తిపోయి పూర్తిగా దెబ్బతినగా పై ఆకుల మాత్రమే అక్కడక్కడ పచ్చగా కనిపిస్తున్నాయన్నారు. దీని పరిగణనలోకి తీసుకొని రిపోర్టులు ఇస్తున్నారు అన్నారు.ప్రభుత్వం ఇది పరిశీలించకుండా పంట నష్టం జరగలేదని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో అధికారులు పంట నష్టం అంచనాలను వేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. మండల స్థాయిలో పత్తి కొనుగోలు కేంద్రాలు పేట్టి నిబంధనల ప్రకారం ఎనిమిది శాతం 8% మాత్రమే పరిగణలో తీసుకోవటం మార్చి, 15% నుంచి 18 శాతం వరకు తేమశాతాన్ని పరిగణలో తీసుకుంటే ఈ తుఫానుకు దెబ్బతిన్న రైతులకు కొంత మేరకు న్యాయం జరుగుతుందన్నారు. దీని ప్రకారం మద్దతు ధర ప్రకారం 8110 రూపాయలకే పాడైపోయిన పత్తి మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. పంటల భీమా పథకాన్ని అమలుపరచినందుకు రాష్ట్ర ప్రభుత్వమే దీనికి పూర్తిగా బాధ్యత వహించి రైతులును నష్టం నుంచి బయటపడే విధంగా చేయాలన్నారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేయాలన్నారు.అదేవిధంగా కౌలు రైతులు కూడా గుర్తించి పంట పండించిన వారికే నష్టపరిహారం చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతులతో రైతు సంఘాలు ఆందోళన చేపడతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు తలసీల సుధాకర్, ఇమ్మడి నాగేశ్వరరావు, కంజుల విఠల్ రెడ్డి, బాణావత్ భద్రయ్య, జోషి లు పాల్గొన్నారు.

# ఎస్టీ కాలనీలో తక్షణమే రోడ్డు బాగు చేయాలి

### 23 వార్డ్ కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగ రజిని

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:** పిడుగురాళ్ల పురపాలక సంఘం సమావేశ మందిరంలో గురువారం ఉదయం మునిసిపల్ కౌన్సిలర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 23 వ వార్డ్ కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగ రజని మాట్లాడుతూ 23 వార్డ్ లోని ఎస్టి కాలనీలో వాటర్ పైప్ లైన్ వేయడం కోసం సిమెంటు రోడ్డు మధ్యలో సిమెంట్ రోడ్ పగలగొట్టారని ఎన్నో రోజులుగా పైప్ లైన్ వేయకుండా రోడ్డు బాగు చేయకుండా ఉండటం వల్ల ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ఆకాలనీ లోకి పోవడానికి ఉన్న ఒకే ఒక్క సిమెంట్ రోడ్ ఉన్నదని, పైప్ లైన్ వేయకుండా రోడ్డు బాగు చేయకుండా ఎన్నో రోజులుగా ఉండటం వల్ల ఆవీధిలోకి పోయే మార్గం లేక ప్రజలు నానావస్తులు పడుతున్నారని, అనారోగ్యం పాలైతే, అనుకోని ప్రమాదం ఏదన్నా జరిగితే టూవీలర్, ఆటో,కారు, అంబులెన్స్ వచ్చే సౌకర్యం లేదని, చివరికి మనుషులు నడిచి వెళ్లే అవకాశం లేదని, తక్షణమే రోడ్డు బాగు చేయాలని, లేదా రోడ్డుపై ఉన్న పగలగొట్టిన కంకర తొలగించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ... ఎస్ టీ కాలనీ, వడ్డెర కాలనీ లలో స్తంభానికి స్తంభానికి మధ్య దూరం ఎక్కువ ఉండటం వలన విద్యుత్ తీగలు ఇళ్ల మీదుగా వెళు తున్నాయని, పౌరులు చేతులెత్తితే తగిలే విధంగా ఉన్నాయని విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందువల్ల మిడిల్ పోల్స్ కరెంటు స్తంభాలు వెయ్యాలని, వార్డు ఊరు చివర్లో ఉండటం వల్ల విధుల్లో కరెంటు స్తంభాలు లైన్ పొడిగించి వీధి దీపాలు వేసి ఎక్స్టెన్షన్ కరెంట్ పోల్స్ వేయాలని కోరెరు. వీధి కాలవ లేక మరుగునీరు ఇంటిముందే ఇంకిపోతున్నాయని దానివలన ఇంటి గోడలు కృంగిపోతున్నాయని మరుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలని కోరెరు. ఈ సమస్యల గురించి కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు వినతి పత్రం ఇవ్వటం జరిగిందని, ప్రతి కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని సభా దృష్టికి తీసుకొస్తున్నామని సాధారణ నిధులనుండి, రాబోవు రోజుల్లో వచ్చు ప్రత్యేక నిధుల నుండి వీటికి ఫండ్స్ మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ను కోరటం జరిగింది. రోడ్ మార్జిన్ దాటి వ్యాపారులు ముందుకు రావడం వలన రోడ్డు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయం గురించి, వాటర్ లైన్ గురించి, పట్టణంలోని వాటర్ కనెక్షన్ డిపాజిట్ అమౌంట్ గురించి,వార్డులో డ్యామేజ్ అయిన రోడ్ల గురించి,, చాప్టలా రిపేర్ గురించి ట్రాఫిక్ వలన జరుగుతున్న మరణాలు గురించి సమావేశంలో వివరంగా చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ ఇ శ్రీవాసరవు, వైస్ చైర్మన్ ఉన్న భారతి, మున్సిపాలిటీ ఏఈ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితర పాల్గొన్నారు.





# అలేఖ్య స్వాములు హెూమంలో పూజా కార్యక్రమం

**గురజాల మేజర్ న్యూస్:** గురజాల మండలం చల్లగుడిపాడు గ్రామంలో వేచి ఉన్నటువంటి శ్రీ అలేఖ్య స్వామి వారి గ్రామ ఉత్సవాన్ని ఎంతో వైభవంగ నిర్వహించారు. కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగ స్వామివారి అఖండ దీపాన్ని పురవీధులలో ఊరేగించారు, ఏకూచాము నుండి భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగ భక్తులు మాట్లాడుతూ అలేఖ్య స్వామి ఎంతో మహిమగల స్వామి అని స్వామివారిని దర్శించుకుని, హెూమంలో ప్రత్యేకంగ ఏర్పాటుచేసిన పండ్లు కాయలు స్వీకరించినట్లయితే ఎంతో శుభం జరుగుతుందని భక్తులు తెలియజేశారు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు,





# రాజాం మున్సిపల్ కమిషనర్‌గా రామచంద్రరావు



**తెనాలి, మేజర్ న్యూస్ :** పుర పరిపాలన శాఖ లో పనిచేసే పట్టణానికి చెందిన ఆకురాతి రామచంద్రరావు రాజాం మున్సిపల్ కమిషన్ గా నియామకం అయ్యారు. తెనాలికి చెందిన రామచంద్రరావు గతంలో తెనాలిలో శానిటరీ ఇన్స్పెక్టర్ గా సుదీర్ఘకాలం పనిచేశారు. కొద్దికాలం క్రితం రేపల్లె పురపాలక సంఘానికి బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో రామచంద్రరావు పదోన్నతి పొంది శ్రీకాకుళం జిల్లా రాజాం మున్సిపల్ కమిషనర్ గా గురువారం డైరెక్టర్ అండ్ కమీషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు అందుకున్నారు. కమిషనర్ గా పదోన్నతి పొందిన రామచంద్ర రావు ను తెనాలి మున్సిపల్ సిబ్బంది, పట్టణానికి చెందిన పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆర్.వి.ఆర్.లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కు డాక్టరేట్



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్:** ఆర్.వి.ఆర్.అండ్ జె.సి.ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న టి.హైమవతికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అధ్యాపక వృత్తిలో 18 సంవత్సరాలు అనుభవం గడించిన టి.హైమవతి బి"మైక్రోఎరే బేస్డ్ కంప్యుటేషనల్ అనాలసిస్ ఫర్ ఐడెంటిఫైయింగ్ ఇన్ఫ్లుయెన్షియల్ జీన్స్ ఇన్ బ్రెస్ట్ కాన్సర్‌బి " అనే అంశంపై ఆర్.వి.ఆర్.అండ్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డా.కె.కార్తీక పవన్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను పి.హెచ్.డి., పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో పి.హెచ్.డి కలిగిన స్టాఫ్ మొత్తము 166 మంది వున్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహిస్తుందని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. పి.హెచ్.డి., పొందిన హైమావతిని కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్, అకడమిక్స్ అండ్ ఆర్%డ%డి డా.కొమ్మినేని రవీంద్ర మరియు వివిధ విభాగాధిపతులు అభినందించారు.



# అయ్యప్ప దీక్ష కఠినమైన వ్రతం

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** అయ్యప్ప దీక్ష అనేది ఒక కఠినమైన ఆధ్యాత్మిక వ్రతం అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ఈ సమయంలో భక్తులు (స్వాములు) మాల ధరించి, బ్రహ్మచర్యం, శాకాహారం, చెప్పులు లేకుండా నడవడం వంటి నియమాలను పాటిస్తారన్నారు. గుంటూరు రూరల్ మండలం నల్లపాడు శ్రీనివాస కాలనీ లోని శ్రీ ధర్మ శాస్త్ర (అయ్యప్ప స్వామీ) దేవస్థానం నందు గురువారం శ్రీరామ్ వర్క్ అండ్ సప్లై వెంగళయపాలెం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద (సద్ది) కార్యక్రమము జరిగింది. పూజా కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ... అయ్యప్ప దీక్ష ద్వారా క్రమశిక్షణ, ఓర్పు, త్యాగం వంటి గుణాలను పెంపొందించుకోవచ్చు. ఈ వ్రతం భక్తులలో భగవంతునిపై నమ్మకాన్ని పెంచుతుంది. మంచి నడవడిక, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన వంటివి అలవడతాయని ఆయన సూచించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సిసిఐ నిబంధన ప్రకారం రైతులు పత్తిని విక్రయించుకోవాలి

**– క్వింటాలు కు రూ.8110 లుగా ధర నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం – ఏఎంసీ చైర్మన్ కోమటినేని శోభారాణి**



**సత్తెనపల్లి , మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఏడాది సీజన్లో పత్తి సీజన్లో కనీస మద్దతు ధర ఒక క్వింటాకి రూ.8110 ల ధర నిర్ణయించారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటినేని శోభారాణి తెలిపారు. గురువారం ఏఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె సమాచారం వెల్లడించారు. చైర్మన్ తో పాటు ఏ డి రవిబాబు ఉన్నా రు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ పత్తి రైతులు మద్దతు ధరను పొందడానికి ( సీసీఐ )సెంటర్లో ఆధార్ కార్డ్, పట్టాదారు పుస్తకం జిరాక్స్ తీసుకొని రైతు సేవా కేంద్రాన్ని ( ఆర్ ఎస్ కె ) సంప్రదించి. ( వి ఏ ఏ ) లచే సీఎం యాప్ నందు రిజిస్ట్రేషన్ చేయించుకుని కపాస్ కిసాన్ యాప్ నందు స్లాట్ బుకింగ్ చేసుకుని తాము ఎంచుకున్న జిన్నింగ్ మిల్లుకు ప్రతిని తెచ్చుకొనవలెను. రైతులు తమ ఆండ్రాయిడ్/ ఆపిల్ మొబైల్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్ డౌన్లోడ్ చేసుకుని కూడా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఏడి రవి బాబు కొన్ని సూచనలు ఇచ్చారు. ప్రత్తి తేమశాతం 8% నుండి12% మాత్రమే ఉండవలెను శాతానికి మించి పెరిగిన ప్రతి 1% చొప్పున మద్దతు ధరలు తగ్గించబడును. మైక్రోనైర్ విలువ నిర్ణీత పరిధి కంటే తక్కువ ఎక్కువ ఉన్నచో ప్రతి కింటాకు 25 రూపాయలు చొప్పున తగ్గించబడును. సీసీఐ వారు ఏ ఇతర పదార్థాలతో కలపని నాణ్యత కలిగిన పత్తిని మాత్రమే కొనుగోలు చేయుదురు. ప్రత్తిని అమ్మకం నిమిత్తం మార్కెట్కి తీసుకువచ్చిన సమయంలో పత్తి పైన నీళ్లు చల్లరాదు. ఈ పంట నందు వివరాలు నమోదు చేసుకున్న రైతులు, కౌలు రైతులు మాత్రమే కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ చేసుకొని ప్రతి కొనుగోలు కేంద్రము తీసుకొని రావలెను. కసాప్ కిసాన్ యాప్ నందు స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులు మాత్రమే సంబంధిత తేదీ లో జిన్నింగ్ మిల్కు రావలెను. గుడ్డి పత్తి కాయలు రంగు మారిన పురుగు పట్టిన ముడుచుకుపోయిన పత్తికాయలను వేరు చేసి శుభ్రమైన పత్తిని తీసుకురావలెను. రైతులు తప్పనిసరిగా వాడుకులో ఉన్న బ్యాంకు ఖాతాను ఆధార్ నెంబర్తో అనుశానందానం చేసుకోవలెను అటువంటి ఖాతాలో మాత్రమే నగదు చెల్లింపు జరుగును. పత్తి కొనుగోలు కేంద్రం సిసిఐ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే కొనుగోలు చేస్తారు. సమావేశంలో కోమటినేని శ్రీనివాసరావు, వెంకటేష్ , కార్యాలయ అధికారులు తదితరులున్నారు.



## జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో పిడుగురాళ్ల హై స్కూల్ విద్యార్థులు మూడు పథకాలు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:** పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బుధవారం యన్ టీ ఆర్ స్టేడియం గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ లో పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు. మూడు పతకాలు సాధించారు. బాలికల అండర్-14. డిస్కస్ త్రో లో 9. వ తరగతి విద్యార్థిని యస్ ధనిక ప్రథమస్థానం 12-14 లాంరింగ్ జంఫ్ లో 8.వ తరగతి విద్యార్థిని అఖిలప్రియ ద్వితియ స్థానం, 1-17 విభాగం (ట్రిపుల్ జంప్ లో 8. వ తరగతి ఏక్యార్థిని షేక్ సుహాన ప్రథమ స్థానం సాధించారు. ఈ ముగ్గురు 8 నుండి 10వ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గంటారు. ఈ రోజు పాఠశాలను సందర్శించిన ఉపవిద్యాశాఖాధికారి యేసుబాబు ఈ ముగ్గురు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. వీరితో పాటు పిడుగురాళ్ల మండల విద్యాశాఖాధికారి ఎ శ్రీనివాసరెడ్డి, హెడ్ మాస్టార్ కొత్త మల్లిఖార్జునరావు, యమ్ ఈ ఓ శ్రీనివాస రావు, విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.



## కాశి విశ్వేశ్వర ఆలయంలో కార్తీక మాస గురు పౌర్ణమి

వినుకొండ మేజర్ న్యూస్: వినుకొండ కొత్తపేట సురేష్ మహల్ రోడ్ నందు గల శ్రీ కాశి విశ్వేశ్వర ఆలయంలో కార్తీక మాస గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ కాశి విశ్వేశ్వర కొలువైన ఆలయ క్షేత్రంలో కార్తీక పౌర్ణమి శాస్త్రక్తంగా శంభో శివ శంభో అంటూ భక్తుల నామస్మరణతో సంబరాలు అంబరాన్ని తాకాయి రాత్రి 7 గంటలకు నూలు వత్తులను నెయ్యితో జ్వాలా తోరణం కనుల పండగగా మరియు ఆలయ ఆవరణలో రంగులతో దీపాలతో శివలింగ అర్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవ్వేత్తంగా సత్య దేవుడి నామస్మరణతో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను తిలకించి పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ లాయర్ సిహెచ్ ఎల్ ఎన్ మూర్తి లాయర్ సైదారావు లాయర్ చంద్రం భావన మోహన్ రావు మరియు నక్క రమణారావు మల్లికార్జున్ రెడ్డి బ్రహ్మం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెండు రోజుల పాటు వాటర్ షెడ్ మహెూత్సవ్

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** రెండు రోజుల పాటు వాటర్ షెడ్ మహెూత్సవ్ జరగనుందని రాష్ట్ర వాటర్ షెడ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సంచాలకులు వై.వి.కె.షణ్ముఖ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి వాటర్ షెడ్ -పిఎంకేఎస్ వై జాతీయ సదస్సు (వాటర్ షెడ్ మహెూత్సవ్) రెండు రోజుల పాటు గుంటూరులో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యునికేషన్స్ సహాయమంత్రి డా. చంద్రశేఖర్ పెమ్మసాని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని వివరించారు. మొదటి రోజు, 10వ తేదీన గుంటూరు ఐటిసి హెూటల్లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రెండవ రోజు 11వ తేదీన గుంటూరు జిల్లాలోని వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలో జరుగనున్న కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి హాజరు అవుతారని తెలిపారు.



## సచివాలయానికి తాళం సిబ్బందికి షోకాజ్ నోటీసులు

### సిబ్బందిపై కమీషనర్ అసహనం

**తెనాలి, మేజర్ న్యూస్ :** మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పట్టణంలోని 36 వ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. ఉదయం 11 గంటలకు సచివాలయానికి తాళం వేడి ఉండడాన్ని ఆయన గుర్తించారు. దీంతో సిబ్బందిని పిలిపించి తాళం ఎందుకు వేశారని ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది ఫీల్డ్ వర్క్ కు వెళ్లామని కమీషనర్ కు తెలిపారు. దీనిపై ఆయన వారిని మందలించారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. సచివాలయం రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. సచివాలయంకు తాళం వేయడంపై ఆయన నలుగురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసారు.

# దుర్గిలో జిల్లా స్థాయి కబడ్డీ టీం ఎంపిక పోటీలు



**దుర్గి మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా దుర్గి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురజాల డివిజన్ పరిధిలోని పది మండలాలకు చెందిన అండర్-17 వయోపరిమితి గల బాలురు, బాలికల జిల్లా స్థాయి కబడ్డీ టీం ఎంపిక పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని దుర్గి మండల విద్యాశాఖ అధికారి డి. బెంజిమెన్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యాలను పెంచుతాయని అన్నారు. విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడాకారులు ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా కబడ్డీ ఎంపిక పోటీలను అడిగొప్పల ప్రధానోపాధ్యాయులు ఆర్. చంద్రశేఖరరావు, దుర్గి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జి.సి.హెచ్. అనంతరామయ్య, కృష్ణయ్య మరియు గురజాల డివిజన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బండ్ల ప్రసాద్ గారి పర్యవేక్షణలో నిర్వహించారు. ఆటలు అత్యంత క్రమబద్ధంగా, పోటీ తత్వంతో సాగాయి. పల్నాడు బీజోన్ వ్యాయామ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ఎక్స్ మాస్ జాన్, కార్యదర్శి అనిల్ కుమార్, ఆర్థిక కార్యదర్శి బి. వేణుగోపాల్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. గురజాల డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహపరిచారు. పోటీల అనంతరం ఎంపికైన బాలురు, బాలికల కబడ్డీ టీంలు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో దుర్గి తరఫున పాల్గొననున్నట్లు వ్యాయామ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాలికల కబడ్డీ టీంను మండల విద్యాశాఖ అధికారి డి. బెంజిమెన్ గారికి పరిచయం చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించినందుకు అందరి ప్రశంసలు అందుకున్నారు. క్రీడాస్థలంలో విద్యార్థుల ఉత్సాహం, ప్రేక్షకుల చప్పట్ల మధ్య దుర్గి మైదానం కబడ్డీ సందడి చేసిందని నిర్వాహకులు తెలిపారు.

## నేడు న్యాయ అవగాహన కార్యక్రమం

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** న్యాయ అవగాహన కార్యక్రమాన్ని శు క్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా దినోత్సవంను ఈ నెల 9వ తేదీన నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా 7వ తేదీ, శుక్రవారం ఉదయం 9.30 గంటలకు న్యాయసేవా సదన్ భవనంలో న్యాయ అవగాహన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాధారణ ప్రజలకు న్యాయ సంబంధిత హక్కులు, లీగల్ సర్వీసుల పథకాలు, వివిధ శాఖల స్టేక్ హెూల్డర్స్ మధ్య అవగాహన, చైతన్యం పెంపు లక్ష్యంగా వివిధ న్యాయ సేవల పథకాల అమలుకు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో న్యాయ సేవలు అందేలా మార్గదర్శకాలు తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఆయా విభాగాల అధికారులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సహకార సూత్రాలతో సామాన్యుల అభివృద్ధే లక్ష్యం

## -ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పి.వి.ఎన్. మల్లికార్జునరావు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** సభ్యులే యజమానులుగా ప్రజలకు విశేష సేవలందిస్తున్న ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ అర్బన్ బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక గుర్తింపుతో ముందుకు సాగుతోందని ఖాతాదారుల విశ్వాసాన్ని సంపాదిస్తూ సామాన్యుల బ్యాంకుగా 110 ఏళ్లుగా సామాన్య పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా లాభదాయకంగా సేవలందిస్తున్నట్లు బ్యాంక్ డైరెక్టర్ పి.వి.ఎన్. మల్లికార్జునరావు తెలిపారు.అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా గురువారం మంగళగిరి బ్రాంచ్ ప్రాంగణంలో జరిగిన సహకార సదస్సుకు బ్యాంక్ డైరెక్టర్ సి.హెచ్. రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ డైరెక్టర్ పి.వి.ఎన్. మల్లికార్జునరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి మరోసారి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం, సహకార రంగ ప్రాముఖ్యతను చాటుతోందన్నారు. పేదరికం, ఆకలి, ఆర్థిక అసమానతలు వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో సహకార సంఘాల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 58 బ్రాంచ్‌లలో సహకార సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ సి.హెచ్. రామారావు మాట్లాడుతూ సహకార స్ఫూర్తితో సభ్యుల సంక్షేమానికి అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. దేశ ఆర్థిక పురోభివృద్ధిలో సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం రుణాలు, విద్యా ప్రోత్సాహకాలు, ఆరోగ్య సాయం వంటి పథకాలు బ్యాంకు ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. ఖాతాదారుల పిల్లలకు వివిధ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నామని గుర్తుచేశారు. డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వ్యాపారులు, వృత్తికారులు, విద్యా-వైద్య అవసరాల కోసం బ్యాంక్ రుణాలను అందించి ప్రజల స్వయం అభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు. ఒక్కరి కోసం అందరూ - అందరి కోసం ప్రతి ఒక్కరూ అనే సహకార సూత్రాన్ని ఆచరిస్తూ సభ్యుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా అరవింద స్కూల్ విద్యార్థులతో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బ్యాంక్ డైరెక్టర్లు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.. ఈ సదస్సులో బ్యాంక్ జోనల్ మేనేజర్ ఈరయ్యారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్, కమిటీ సభ్యులు ఎం. సాంబశివరావు, నాగకుమారి, పి. సుజాత, కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యశేఖర్, రావెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంపదను పెంచుకోవాలి

## -యూపీ హెచ్ సీ డాక్టర్ అనూష



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఆరోగ్య సంపదను పెంచుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష అన్నారు. మంగళగిరి రత్నాల చెరువులో స్థానిక నిర్మల కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరంలో విద్యార్థుల సేవలు కొనసాగుతున్నాయి. ఆరవ రోజైన గురువారం మన ఆరోగ్యం - మన సంపద అనే అంశంతో శిబిరంలో పేదలకు ప్రాథమిక వైద్య సేవలు అందించారు. ముఖ్య అతిథులుగా మంగళగిరి ఇందిరానగర్ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష, ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవటం అభినందనీయమన్నారు. మనిషి తాను ఏమి సాధించాలన్న ఆరోగ్యం ప్రధానమని, ఆస్తి కంటే ఆరోగ్య సంపద పెంచుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాలలోని మురికివాడలలో ఎన్ఎస్ఎస్ క్యాంపులు నిర్వహిస్తూ ఆయా ప్రాంత ప్రజలను ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విభాగం సేవలను ఆమె ప్రశంసించారు. అసిస్టెంట్ కమిషనర్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో చేసే సేవా కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా కాలేజీ అండ్ ఫార్మసీ ప్రాక్టీస్ శాఖాధిపతి డాక్టర్ షేక్ ఫైజర్ అలీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు ఎం బిందు ప్రియ, కే కీర్తి, ఎమ్ మానస తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావులను ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# 9న బాపట్లలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దంటూ సదస్సు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నవంబరు 9న ఉదయం గం. 10-30లకు బాపట్ల ఎన్.జి.ఒ. హాల్‌లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేక సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ కో-కన్వీనర్లు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినయకుమార్లు తెలిపారు. గురువారం బాపట్ల ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పి.పి.పి. విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ శక్తులకు అప్పజెబితే వైద్య విద్య ఖరీదు అవుతుందని పేదలకు వైద్యం అందుబాటులో ఉండదని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలుకావని, సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తారని పేర్కొన్నారు. గత 17 నెలలుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో వేలాది కోట్ల విలువ జేసే భూములను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ, మరొకవైపు 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుబంధ 10 ప్రభుత్వ ఆసుపత్రులకు కేవలం 5 వేల కోట్లు చెల్లించలేని దిన స్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పటాన్ని ఎద్దేవా చేసారు. ఏడాదికి 9 లక్షల కోట్లు లాభాన్ని ఆర్జించే గూగుల్ సంస్థకు 22 వేల కోట్ల రాయితీలతో స్వాగతం పలికారని గుర్తు చేశారు. ఈ నెల 9న బాపట్లలో జరిగే సదస్సులో సి.పి.ఎం. కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నేతలు షేక్ మస్తాన్ వలి, గంటా అంజిబాబు, సి.పి.ఐ. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేగ ప్రభాకర్, వివిధ పౌర సమాజ నేతలు పాల్గొంటారని, సదస్సుకు ప్రముఖ వైద్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డా. ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని భావించే ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి సి.హెచ్. గంగయ్య, సమాజ్వాది పార్టీ అధ్యక్షులు మేధా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు దోనెపూడి దేవరాజు, సి.ఐ.టి.యు. నాయకుడు మజుందార్, కాంగ్రెస్ నాయకులు శీలం సాగర్, ఫోరం ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పి.సి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామం అయ్యప్ప నామ స్వరంతో మార్మోగింది



**గురజాల మేజర్ న్యూస్ :** చర్లగుడిపాడు గ్రామంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి వివిధ మాలలు ధరించినటువంటి వందలాది మంది స్వాములు శరణం శరణం అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప అంటూ చేసిన నామస్మరణం భజనతో గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడింది, స్వామివారికి ప్రత్యేకంగా అరటి బోజలతో వేదికను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురు స్వామి నల్లూరి కోటి ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, వివిధ రకాల పూలతో, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివపార్వతులు గా కళాకారుల నాట్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చర్లగుడిపాడు అయ్యప్ప స్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవం ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు సద్ది కార్యక్రమం ఏర్పాటు చేశారు. భజన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆహార కల్తీ చేశారో... జరిమానా తప్పదు

## - మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** హోటల్ యజమానులు ఆహార కల్తీ నిర్వహిస్తే జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని హోటల్స్, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్స్ పై వారి సిబ్బందిచే ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటల్ లో నిల్వ ఉంచిన చపాతీలు గుర్తించిన శానిటరీ ఇన్స్పెక్టర్ ,సచివాలయాల సెక్రటరీలు. ఆ హోటల్ యజమానిపై చర్యలు, జరిమానాకు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు. ఈ తనిఖీల్లో కొన్ని హోటల్స్ లో బాగా మరిగించిన నల్లటి ఆయిల్ ఉండటం గుర్తించారు. వెంటనే ఆ ఆయిల్ ను తొలగించాలని యజమానులకు ఆదేశాలు. వారికి మొదటి సారి హెచ్చరికగా మరో సారి ప్రజల ఆరోగ్య దృష్ట్యా ,నాణ్యమైన ఆయిల్ తో,మంచి ఆహారాన్ని ప్రజలకు అందించాలని, హోటల్ పరిసర ప్రాంతాల్లో శుచి, శుభ్రత పాటించాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని ఉంచరాదని, సింగల్ యూజ్ ప్లాస్టిక్, వాటర్ బాటిల్స్ వాడరాదంటూ, కర్రి పాయింట్స్ లో వాడే కవర్లను నిలుపుదల చేయాలంటూ, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారిపై చర్యలకు ఆదేశాలు ఇచ్చారు.

# సేంద్రియ పద్ధతిలో భూసారాన్ని మెరుగుపరుచుకోవాలి

## శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి ఎం. అరుణ



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** సేంద్రియ పద్ధతిలో భూసారాన్ని పెంపొందించుకోవాలంటే పచ్చి రొట్ట పైర్లు, పంట అవశేషాలను కాల్చి వెయ్యకుండా కుళ్ళ బెట్టుకోవాలని తెలిపారు. అలాగే జీవన ఎరువులు వాడకం వలన రసాయన ఎరువుల వాడకం 20% తగ్గుతుందని శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.అరుణ తెలిపారు. గురువారం ముప్పాళ్ళ మండలం లోని మాదాల గ్రామం లో గ్రామ సచివాలయం కార్యాలయం నందు రైతులకు భూమి ఆరోగ్యం, భూసారం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి, ముప్పాళ్ళ ఎస్.శ్రీధర్ రెడ్డి ప్రతి కొనుగోలు పై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా శిక్షణ కేంద్రం విస్తరణ అధికారి కరీమున్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నీలిమ, గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు పంపిణి



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** పట్టణానికి చెందిన 4వ వార్డ్ నివాసులు జగదపు నాగేశ్వరావు కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా ప్రజా చైతన్య భారతి సేవా సంస్థ వారిని సంప్రదించారు సంస్థ అధ్యక్షులు సభ్యులు కలసి నాగేశ్వరావు కుటుంబంకు నెలకు సరిపడా బియ్యం నిత్యావసర సరుకులు అందించినా రు. సబ్ జైలు ప్రాంగణంలోని జాతి పిత మహాత్మా గాంధీ విగ్రహం నందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర టి. డి. పి అధికారప్రతినిధి చౌట శ్రీనివాసరావు సంస్థ చేస్తున్నా సేవలను కొనియాడారు. మరో అతిథిగా గుంటూరు ఆశీర్వాదం పాల్గొన్నారు. అనంతరం సంస్థ సభ్యులు కె నాసరయ్య కు ముఖ్య అతిదులు సభ్యులు చిరు సత్కారం చేయడం జరిగింది .ఈ కార్యక్రమం లో సంస్థ అధ్యక్షులు దుబాగుంట జానకి రామయ్య, ఉపాధ్యక్షులు పి ఆంజనేయులు, సెక్రటరీ కె ప్రేమ్ కుమార్, ట్రెజరర్ డి మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

## -ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఎలాంటి ఆపదలోనైనా ప్ర జలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎ మ్మెల్యే నరేంద్ర కుమార్ పే ర్కొన్నారు పెదకాకాని మం డలం నంబూరు గ్రామం విజయ్ భాస్కర్ నగర్ ఏరియాకు చెందిన 8 వ తరగతి చదువుచున్న నేలపాటి భరత్ ఇటీవల గ్రామంలోనికి వచ్చిన వరద కారణంగా ప్రమాదవశాత్తు కాల్వలో పడి మరణించారు. మరణించిన బాలుడు యొక్క తల్లిదండ్రుల బాధ తీర్చలేనిది అయినప్పటికీ స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రభుత్వం తరపునుండి భరత్ తల్లిదండ్రులు నేలపాటి సురేబాబు, నేలపాటి ఇస్తేరు రాణి కు 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును అందించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ ఆపద వచ్చిన ఆదుకుంటూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు ఈ సందర్భంగా భాదితులు నరేంద్ర కుమార్ కు ధన్యవాదములు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని తాసి ల్దార్ కృష్ణ కాంత్ మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు విజ్ఞప్తి - సి సి ఐ 30 కొనుగోలు కేంద్రాలను తెరిచింది - సి సి ఐ మేనేజర్

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ప్రస్తుత పత్తి సీజన్ 2025-26 లో పత్తి కొనుగోలును కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి సి ఐ) ద్వారా ప్రారంభించబడింది. పత్తి రైతుల హక్కులను రక్షించడానికి, కార్పొరేషన్ తన పరిధిలో ఉన్న జిల్లాల్లో మొత్తం 30 కొనుగోల కేంద్రాలను తెరిచిందని సి సి ఐ మేనేజర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం పత్తిలో తేమ శాతం 8% మించకపోతే, రైతులకు పూర్తి కనీస మద్దతు ధర (ఎం ఎస్పి) ఇవ్వబడుతుంది. అయితే, తేమ శాతం 8% కంటే ఎక్కువగా 12% వరకు ఉన్నా, ఎం ఎస్పి పై 8% పైగా ఉన్న తేమను తక్కువ చేసి చెల్లించబడును. అందువలన, కార్పొరేషన్ పత్తి రైతులను ఆరబెట్టిన పత్తి మాత్రమే కేంద్రాలకు తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తుంది. తద్వారా అధిక తేమ వలన తగ్గింపు ఉండదు. ఎలాంటి పరిస్థితులలోనైనా, పత్తిలో తేమ శాతం 12% మించకూడదు. ఏదైనా సహాయం అవసరమైతే, రైతులు కార్పొరేషన్ శాఖ కార్యాలయం గుంటూరు ను వాట్సాప్ హెల్ప్ లైన్ నంబర్ 7659954529 ద్వారా సంప్రదించవచ్చు.

## 130 వ రోజుకు చేరిన రిలే నిరసన దీక్ష

- రెండవసారి భూ సమీకరణను అడ్డుకుంటాం..
- ఎకరానికి కోటి రూపాయలు 1250 గజాలు రైతులకు ఇస్తే ఒప్పుకుంటాం..
- ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు




**గుంటూరు సిటీ, మేజర్ న్యూస్ :** జేకెఆర్ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్ష 130 వ రోజుకు చేరింది. రాజధాని రైతులను మోసం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కుట్రపూరితమైన ఆలోచనలతో భూసమీకరణ చట్టాన్ని తీసుకు రాబోతోందని, ఎట్టి పరిస్థితులను ఈ చట్టాన్ని అమలులోకి రానివ్వబోమని ఆంధ్రరాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 11 సంవత్సరాల క్రితమే 33 వేల ఎకరాలు భూ సమీకరణ పేరిట రాజధాని నిర్మాణం కోసం భూములు అడిగితే రాష్ట్ర ప్రజలు మన రాష్ట్రం కోసమే కదా మన రాజధాని కోసమే కదా అంటూ నమ్మి భూములు ఇచ్చిన రైతులు నేడు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 11 సంవత్సరాల గడిచి పోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అభివృద్ధి చేయలేకపోయిందని ఆరోపించారు. మళ్లీ 40 వేల ఎకరాలు భూములు కావాలని భూసమీకరణ పేరుతో ముందుకొస్తున్నారని ఎట్టి పరిస్థితిలో ఈ భూమి ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. అవసరమైతే రైతాంగం కోసం తమ పార్టీ తరపున ఆందోళన కార్యక్రమాలు, చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అలా కాని పక్షంలో ఒక్కొక్క రైతుకు ఎకరానికి కోటి రూపాయలు చొప్పున ఎక్స్ గ్రేసీయోగా ప్రకటించాలని, గతంలో భూసమీకరణ చట్టంలో పొందుపరిచిన విధంగా 1250 గజాల స్థలం ఇచ్చి రైతుల వద్ద నుండి భూములు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. రైతుల డిమాండ్ల కోసం ఎంతవరకైనా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు వెల్లడించారు. ఈ రిలే నిరసన దీక్షకు రాజధాని రైతులు, పార్టీలకు అతీతంగా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మద్దతు ఆయనకు పలుకుతున్నారు.

## ఎస్.ఆర్.ఎం పై విచారణ కమిటీ వేసాం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**గుంటూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ లో ఫుడ్ పాయిజన్ పట్ల విచారణ కమిటీని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో తెనాలి సబ్ కలెక్టర్, ఉన్నత విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఆహార తనిఖీ అధికారి, మంగళగిరి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారిని నియమించారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ లో ఫుడ్ పాయిజన్ అంశాల పట్ల క్షుణ్ణంగా విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ మేరకు కమిటీ తన పనులను ప్రారంభించింది.

## యర్రబాలెం లో వేర్వేరు నివాసాల్లో చోరీ

### - రూ. 15 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం లో వేర్వేరు నివాసాల్లో జరిగిన చోరీ కేసుల్లో సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను గుర్తుతెలియని దుండగులు దోచుకున్నారు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎర్రబాలెం చెందిన ఇంగువ మహేష్ కుమార్ శర్మ పురోహిత్యం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపద్యంలో ఈనెల మూడో తేదీ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్లారు. మరుసటి రోజు సాయంత్రం ఇంటికి తిరిగివచ్చే సరికి ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్ళి చూడగా బీరువాలోని బంగారు, వెండి వస్తువులు మాయమయ్యాయి. దీంతో బాధితుడు మహేష్ కుమార్ శర్మ మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన రూరల్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా యర్రబాలెంకు చెందిన భూక్యా వీరాంజనేయులు నాయక్ వెంకటపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ గా పనిచేస్తున్నాడు. యర్రబాలెంలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వీరాంజనేయులు నాయక్ ఈనెల 3వ తేదీన కుటుంబంతో కలిసి కోయ వారి పాలెం వెళ్లారు. తిరిగి ఈనెల ఐదవ తేదీ ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని వెండి వస్తువులతో పాటు రూ. 20వేల నగదు మాయమైంది. దీంతో బాధితుడు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రామాల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

### - ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జైబున్ బీ






**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** చలికాలం నేపథ్యం లో ఫ్లూ, వైరస్ ల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ ల సహకారం తో దోమల నియంత్రణ కు గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు యలవర్తిపాటి షేక్ జైబున్ బీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ను గురువారం మండల పరిషత్ సమావేశ మందిరం లో నిర్వహించారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. ఎం పీ డీ వో మాట్లాడుతూ మొత్తం 19 మంది ఎంపీటీసీ లకు గాను 17 మంది సమావేశానికి హాజరు అయినట్టు వెల్లడించారు. జాతీయ గేయం వందేమాతరం కు 150 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యం లో నవంబర్ 7 శుక్రవారం రోజున గ్రామాల్లో ప్రజలు, అధికారులు అందరు కలసి వందేమాతరం ను ఆలపించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన వాట్సప్ గవర్నెన్స్ కార్యక్రమం, మనమిత్ర గురించి సచివాలయం సిబ్బంది అందరూ కలిసి గ్రామస్థులకు తెలియచేసి అవగాహన కల్పించాలని కోరారు. సర్పంచ్ ల సహకారం తో పంచాయతీ కార్యదర్శులు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కోరారు. నూతనం గా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఎంపిడిఓ టీ సుధారాణి మాట్లాడుతూ మండలం లోని 25 గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ ల సహకారం తో ప్రత్యేక పరిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పీ ఆర్ వన్ యాప్ లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు పెండింగ్ లేకుండా సమయానికి అన్ని పారిశుధ్య పనుల వివరాలను అప్లోడ్ చేయాలని కోరారు. తాగు నీరు, పారిశుధ్యం, మురుగు నీటి పారుదల వంటి ప్రాథమిక మరియు కీలక అంశాల పట్ల పూర్తి బాధ్యత గా కార్యదర్శులు వ్యవహరించాలని కోరారు.ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు.ఈ కార్యక్రమం లో ఇంకా వైద్య అధికారిణి, మండల విద్యాధికారి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ, మండల వ్యవసాయ అధికారి, పంచాయతీ రాజ్ ఏ ఈ,పశువైద్యధికారి, ఏ పీ ఎం, ఇరిగేషన్ అధికారి, ఐసీడీఎస్ అధికారి, హౌసింగ్ అధికారులు తమ శాఖల ప్రగతి ను చదివి వినిపించారు.వివిధ గ్రామాల సర్పంచ్ లు,పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశం లో పాల్గొన్నారు.

## తల్లి తండ్రుల పాత్ర చాలా కీలకం





**గుంటూరు, మేజర్ న్యూస్ :** తమ పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర విద్యార్థి దశలో చాలా కీలకమని టి జె పి యస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. కళాశాలలో గురువారం "తల్లి తండ్రులు -విద్యార్థుల" సమావేశం జరిగింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... విద్యార్థులు జీవితాలలో ఉన్నత స్థానాన్ని ఎంపిక చేసుకునే దశ డిగ్రీ దశని.. ఈ డిగ్రీ కోర్స్ పూర్తయ్యే సరికి ప్రతి ఒక్క విద్యార్థి జీవితాలలో స్థిర పడే విధంగా సిద్ధంగా ఉండాలని కోరారు. కళాశాల లో ఉన్నటువంటి ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి, స్పోర్ట్స్ వంటి వాటిలలో పాల్గొని శారీరకంగా, మానసికంగా శక్తివంతగా ఉండాలని, ఏదైనా అర్థం కాక పోతే అధ్యాపకులని అడిగి తెలుసుకుంటూ చక్కని లైబ్రరీని వినియోగించుకుని అభివృద్ధిపదంలో ముందుకు వెళ్లాలని చెప్పారు. అదేవిధంగా మొబైల్, ఇంటర్నెట్, ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా మాయలో పడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, ఇంటర్ ఇంచార్జ్ జి సురేష్ కుమార్, మేజర్ పి కుమార్ రాజా, డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, ఇతర అధ్యాపకులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

## 11న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధుల పర్యటన

### - ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్ :** ఈ నెల 11 న వెంగళయపాలెం గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద జరగనున్న జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమం మరియు అమృత్ సరోవర్ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధులు విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ స్వయంగా పరిశీలించారు. సౌత్ సబ్-డివిజన్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్బీ సీఐ రాంబాబుతో సమావేశమై బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించి, పలు సూచనలు జారీ చేశారు. మంచినీటి చెరువు వద్ద జరుగనున్న కార్యక్రమానికి అనువుగా అన్ని భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా భారీ కేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, కార్యక్రమానికి హాజరయ్యే కేంద్ర బృందం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు మొదలైన వారి సంఖ్యను దృష్టిలో ఉంచుకుని తగిన భద్రత మరియు బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బృందం భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి, ఎటువంటి లోపాలు లేకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా లయోలా పాఠశాలలో జరగనున్న సంబంధిత కార్యక్రమానికి కూడా కట్టుదిట్టమైన భద్రతా మరియు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సూచించారు.

## టీడీపీ నుండి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్ :** గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, 46వ డివిజన్ కు చెందిన టిడిపి నాయకులు **"ధన సాయి కుమార్ చౌదరి", "హారిక"** కూటమి ప్రభుత్వ రాజకీయాలకు విసుగు చెంది ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు ఎందరో పేదలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే కాకుండా ఇతరులు కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే విధంగా ధనార్జనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ, ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వైనానికి నిరసనగా వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నుంచి భారీగా చేరుతున్నారన్నారు అని అన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, మరియు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పర్యటనలో క్షతగాత్రులకు... వైద్య సేవాసాయం అందించిన గజ్జల

## అధినేత జగన్ వద్దకు తీసుకెళ్లి క్షతగాత్రులను పరిచయం చేయించిన డాక్టర్ గజ్జల






**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** పార్టీ కార్యకర్తలు క్షతగాత్రులు అయితే నాయకులు పరామర్శించి, పరిహారం ఇచ్చి వదిలేస్తుంటారు. వైద్యుడే.. నాయకుడు అయితే తక్షణం క్షతగాత్రులను మానవీయ కోణంలో ఆలోచించి వృత్తి ధర్మంతో పాటు, నాయకత్వాన్ని నిలబెట్టుకునేలా పూర్తిగా కోలుకునే వరకు వారికి వైద్య సేవలు అందించి భరోసా కల్పిస్తారు. ఇలాంటి సంఘటన సత్తెనపల్లి నియోజకవర్గంలో జరిగింది వివరాల కు వెళ్తే.. మూడు నెలలు క్రితం రెంటపాళ్ల గ్రామంలో జరిగిన కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు జగన్ గారి సెక్యూరిటీ కాన్వాయ్ తగిలి బృగుబండ గ్రామానికి చెందిన అన్నెం పున్నమ్మ కాలికి దెబ్బ తగలడం జరిగింది. నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న వినియోజకవర్గ ఇంచార్జీ సుధీర్ భార్గవ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఆయన గజ్జల హాస్పిటల్స్ లోనే ఆపరేషన్ చేసి, ఉచిత వైద్య అందించారు. జగన్ దగ్గరకి తీసుకు వెళ్లి వారి గురించి జగన్ కు వివరించి వైద్య సేవల సాయం గురించి తెలిపారు. వారిని ఆత్మీయంగా పలకరించిన జగన్మోహన్ రెడ్డి పార్టీ మీకు అండగా ఉంటుందన్నారు. ఏ ఇబ్బంది వచ్చిన నన్ను కలుసుకోవాలని సూచించారు. క్షయగాత్రుల పట్ల స్వత హాగా వైద్యుడు అయిన గజ్జల భార్గవ్ రెడ్డి చేసిన సేవలను ఆయన అభినందిం చారు. నియోజకవర్గం కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు.

# లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి

## గుంటూరు కలెక్టర్ కు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం






**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయం నుంచి డేటా ఆధారిత పాలనపై గురువారం సదస్సు జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ విధానంలో జరిగిన ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యత కావాలన్నారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామని పేర్కొన్నారు. అంతా కలిసి కట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫాన్‌ను టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగామని చెప్పారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని అన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచించారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శేష శ్రీ, మెప్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్ యును సందర్శించిన రట్జర్స్ బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ డీన్



రట్జర్స్ బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ డీన్ థామస్ హిల్ ను సత్కరిస్తున్న కెఎల్ యు విసి డాక్టర్ పార్ధసారదివర్మ తదితరులు

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రట్జర్స్‌లో భాగమైన ది స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ న్యూజెర్సీ రట్జర్స్ బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ డీన్ థామస్ హిల్ గురువారం కెఎల్ యూనివర్శిటీని సందర్శించారు. ఇది టాప్ 15 యుఎస్ పబ్లిక్ యూనివర్సిటీలలో ఒకటిగా నిలిచింది. తన పర్యటన సందర్భంగా, మిస్టర్ హిల్ తన ప్రపంచ కెరీర్ ట్రెండ్‌లు, అభివృద్ధి చెందుతున్న యుఎస్ జాబ్ మార్కెట్ మరియు బిజినెస్ అనలిటిక్స్, క్వాంటిటేటివ్ ఫైనాన్స్, హెల్త్ కేర్ అనలిటిక్స్ వంటి రంగాలలో మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు వృత్తిపరమైన వృద్ధిని ఎలా వేగవంతం చేయగలవో అనే దానిపై చివరి సంవత్సరం విద్యార్థులకు ఆకర్షణీయమైన ప్రసంగం చేశారు. కెఎల్ విశ్వవిద్యాలయం రట్జర్స్ బిజినెస్ స్కూల్ మధ్య సహకారానికి గల సంభావ్య రంగాలను చర్చించడానికి మిస్టర్ హిల్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి సారథి వర్మతో కూడా సమావేశమయ్యారు. ఈ సందర్శన కెఎల్ విశ్వవిద్యాలయం రట్జర్స్ ఇండియా టూర్‌లో చేర్చడాన్ని సూచిస్తుంది, ఇది ఇప్పటికే ఐఐఎం ఇండోర్, ఎక్స్ఎల్ ఆర్ ఐ జంషెడ్‌పూర్ వంటి అగ్ర సంస్థలను కలిగి ఉంది. డాక్టర్ జి.పి. సారథి వర్మ అతిథిని సత్కరించారు. డాక్టర్ పి.వి.ఆర్. ప్రసాద్ రావు, డాక్టర్ అనుష, జమీందార్ వంటి సీనియర్ అధ్యాపకులు ఈ సంభాషణలో పాల్గొన్నారు.

# ఘనంగా గండబేరుండ అఖండ దీపోత్సవం



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి సనాతన ధర్మ రక్ష సేన ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువైఉన్న దివ్య క్షేత్రమైన పానకాల స్వామి కొండపై వేంచేసియున్న గండబేరుండ స్వామివారి అఖండ దీపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆకురాతి నాగేంద్రం ఆధ్వర్యంలోని సనాతన ధర్మ రక్ష సేన సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమం గండాలయ స్వామి ప్రాంగణంలో దివ్య అఖండ దీపాన్ని టిటిడి బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, కందుల సూర్యప్రకాష్ స్వామీజీ మునగాల శ్రీనివాసరావు, మంద్రు సత్యనారాయణ, కాటా బత్తుల విజయ్ కుమార్, తెంపల్లి దుర్గారావు, కాటాబత్తుల రంగనాయకమ్మ, వాసి శ్రీనివాసరావు తదితరులు అఖండ జ్యోతిని వెలిగించి గండాల స్వామికి పూజలు నిర్వహించారు. తొలుత పాత మంగళగిరి సీతారామ కోవెల వద్ద నుండి మంగళగిరి చేనేత మగ్గాలపై నేసిన 750 మీటర్ల చేనేత వస్త్రాన్ని, 250 కేజీల ఆవు నెయ్యిని దేవాలయంలో పూజలు నిర్వహించి అర్చక స్వాముల మంత్రంతో మేళతాళాలతో ఊరేగింపుగా లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చేరుకొని శ్రీ లక్ష్మీనరసింహస్వామి రాజ్యలక్ష్మి అమ్మవార్లకు పూజలు నిర్వహించి అనంతరం పానకాల స్వామి కొండపైన ఉన్నటువంటి గండాలయ స్వామి చెంతకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్తలకు టిడిపి అండ... ఎమ్మెల్యే యరపతినేని



**మాచవరం, మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గం నందు పార్టీ సభ్యత్వం తీసుకుని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగి వున్న పార్టీ కార్యకర్తలుకు టిడిపి పార్టీ అండగా ఉంటుందని గురిజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన "సీతయ్య మర్రి "కుటుంబానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా చెక్కుని అందజేశారు. కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉండి ఇన్సూరెన్స్ రూపేణా వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల రూపాయలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. పార్టీ జెండా మోసే కార్యకర్త గురించి, కార్యకర్త కుటుంబ సంక్షేమం గురించి ఆలోచించే మొదటి పార్టీ తెలుగుదేశం అని. ఇది ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త సగర్వంగా చెప్పుకొనే మాట. భారతదేశంలోనే ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తల వారి కుటుంబ సభ్యులకు సహాయనిధిని అందచేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ యామని రామారావు, టిడిపి మండల కన్వీనర్ బడి గుంచల వెంకటేశ్వర్లు, కొత్తపాలెం మాజీ సర్పంచ్ జమ్మి గుంపుల వెంకటేశ్వర్లు, బొత్స సత్యనారాయణ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్ యు లో నైతిక విలువలు

## – భావోద్రేకాల నియంత్రణపై అవగాహనా సదస్సు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** విలువలు పాటించినప్పుడే విజయం సాదించవచ్చునని ప్రముఖ సోషల్ ఆక్టివిస్ట్ , కౌన్సిలర్ మాలతి అన్నారు. గురువారం నాడు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కెఎల్ యు లో నైతిక విలువలు – భావోద్రేకాల నియంత్రణపై అవగాహనా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తు ప్రతీ విద్యార్థి నైతిక విలువలు కలిగి ఉన్నప్పుడు ఉన్నతమైన లక్ష్యాలను అధిరోహించడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా యువతను పెడద్రోవ పాటించే స్నేహాలకు, బంధాలకు దూరంగా ఉన్నప్పుడే.. కోరుకున్న ఆశయాలను చేరుకుంటారాని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విధ్యార్ధి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ కెఆర్ఎస్. ప్రసాద్, కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ రూత్ రమ్య, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ శ్రీలక్ష్మి, విజయ రత్నం, విఇసి విభాగం సైకాలజిస్టులు కిషోర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న నియోజకవర్గాల ఇన్చార్జ్ (ఆర్సీ) గా పనిచేసేందుకు విలేకరులు కావలెను. వాటిలో నరసరావుపేట, వినుకొండ, పొన్నూరు, తెనాలి, తాడికొండ, మంగళగిరి చిలకలూరిపేట, పెద్దకూరపాడు మండలాల నుంచి దాచేపల్లి, నరసరావుపేట టౌన్, నరసరావుపేట రూరల్, రొంపిచర్ల మండలాలకు విలేకరులు కావలెను. సంప్రదించేందుకు

ఎన్.లక్ష్మినారాయణ

(రీజనల్ మేనేజర్), ఫోన్ నెం 63011 07116

# రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**-ఓ రెస్టారెంట్ యాజమాన్యంపై కేసు నమోదు**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** రెస్టారెంట్లు, హోటల్స్, దాబాలు తదితర ప్రాంతాల్లో ఆహారంలో కల్తీ చోటు చేసుకుంటోంది. నాణ్యత లోపిస్తోంది. అంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లు వెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఆహార భద్రత అధికారులు 8 బృందాలుగా ఏర్పడి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని హోటల్స్, రెస్టారెంట్ల నందు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆహార నాణ్యత, శుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి శ్రీనివాస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మంగళగిరి పరిధిలోని న్యూ మిత్రా డాబా, నార్త్ మిత్రా డాబా, కిచిడి మండి, లిటిల్ విలేజ్ రెస్టారెంట్, బిస్మిల్లా దమ్ బిర్యాని సెంటర్, బరకాస్ రెస్టారెంట్, అభిరుచి రెస్టారెంట్, సహస్ర టిఫిన్, తాడేపల్లి పరిధిలోని అవర్ ప్లేస్, కోడికూర పప్పుచారు హోటల్, బిస్మిల్లా బిర్యానీ ప్యాలెస్ ల నందు తనిఖీలు నిర్వహించాం. అని పేర్కొన్నారు. తాడేపల్లి పరిధిలోని కోడికూర పప్పుచారు హోటల్ నందు రంగు కలిపి ఉన్న డబ్బాలు లభ్యమైనందున సదరు హోటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రంగు డబ్బాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపినట్లు చెప్పారు. మిగిలిన అన్ని హోటల్స్ యజమానులకు శుభ్రత సక్రమంగా పాటించాలంటూ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మరి కొన్ని హోటల్స్ నందు ఉన్నటువంటి నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, వండిన ఆహారాన్ని కొంత శాంపిల్స్ రూపంలో సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపినట్లు చెప్పారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే ఆహార పదార్థాలు ఉన్నట్లు పరీక్షల్లో తేలితే మిగిలిన హోటల్స్ యజమానుల పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు జి వెంకటేశ్వరరావు, వెంకట రత్నం, ఫుడ్ ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, ప్రణీత్ కుమార్, శివ తేజ, శ్రీధర్ రెడ్డి, గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్లు రమేష్ బాబు, లక్ష్మీనారాయణ, దేవరాజు, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఘటనపై ఆరా తీసిన మంత్రి కందుల దుర్గేష్

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఘటనపై లండన్ పర్యటనలో ఉన్న గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. ఫుడ్ పాయిజన్ తో వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన కారణాలపై ఆరా తీశారు. ఈ ఘటనపై విభిన్న కోణాల్లో క్షుణ్ణంగా విచారణ చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీకి మంత్రి దుర్గేష్ ఫోన్ ద్వారా పలు సూచనలు చేశారు.



# కావ్య హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్ ప్రారంభించిన జంగా కృష్ణమూర్తి

**మాచవరం, మేజర్ న్యూస్** పల్నాడు జిల్లా దాచేపల్లి పట్టణంలోని ఇటీవల నూతనంగా ప్రారంభించిన కావ్య హాస్పిటల్ ని సందర్శించి హాస్పటల్ నందు నూతంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్ ని ప్రారంభించిన టి. టి. డి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువ వైద్యులందరూ ఐఎంఏ లో క్రియాశీలకంగా ఉండాలి

## -డాక్టర్ జి. నందకిషోర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు



ఐఎంఏ గుంటూరు శాఖ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డాక్టర్ జి నందకిషోర్ ,పక్కన డాక్టర్ సుబ్బారాయుడు నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ టి. సేవకుమార్.

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** భారతదేశంలోని అలోపతి వైద్యుల అతిపెద్ద జాతీయ సంఘం అయిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ)లో యువ వైద్యులందరూ సభ్యులుగా చేరి ,క్రియాశీలకంగా ఉండాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ గార్లపాటి నందకిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జీఎంఏ హాల్లో నిర్వహించిన ఐఎంఏ గుంటూరు శాఖ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార సభలో డాక్టర్ గార్లపాటి నందకిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు .సభకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు .డాక్టర్ నందకిషోర్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రతిఏటా అనేకమంది యువ వైద్యులు వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్నారని , వారందరూ ఐఎంఎలో సభ్యులుగా చేరి, క్రమం తప్పకుండా ఐఎంఏ కార్యక్రమాలకు హాజరవ్వడం ద్వారా సీనియర్ వైద్యుల గురించి తెలుసుకోవడమే కాక వారినుంచి వైద్య వృత్తిపర అనుభవాలను పంచుకోవచ్చునని ,తద్వారా అనారోగ్య బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునన్నారు .ఈ సందర్భంగా గత నవంబర్ నెలలో గుంటూరులోనిర్వహించిన ఐఎంఏ 66వ రాష్ట్ర సదస్సుకు ఆర్థికంగా ,హార్దికంగా సహకరించిన వైద్యులందరికీ డాక్టర్ నందకిషోర్ ధన్యవాదాలు తెలిపారు. సభాధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు మాట్లాడుతూ ఐఎంఏ అధ్యక్షులుగా గత సంవత్సరకాలంలో వైద్యులకు అనేక నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు ,బిపి ,షుగర్ క్యాన్సర్ వంటి దీర్ఘకాల వ్యాధులు నిరోధమే లక్ష్యంగా ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం తీసుకువచ్చేందుకుపలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు . గత నవంబర్ నెలలో గుంటూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సును డాక్టర్ నందకిషోర్ సారథ్యంలో విజయవంతంగా నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చింది అన్నారు. అందుకు సహకరించిన వైద్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభలో పాల్గొన్న జిఎంఏ అధ్యక్షులు డాక్టర్ య లమంచిలి సంజయ్ మాట్లాడుతూ ఐఎంఏ గుంటూరు శాఖ జిఎంఎ హాల్ పునర్నిర్మాణంలో కీలక భాగస్వామి అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు .అన్ని విభాగాల వైద్య, శస్త్ర చికిత్స నిపుణులైన వైద్యులు జిఎంఏ హాల్ ను, తమ నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలకు వినియోగించుకోవాలని కోరారు. ఐఎంఏ గుంటూరు శాఖ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ టి.సేవకుమార్ ప్రసంగిస్తూ ప్రస్తుతం వైద్య వృత్తి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటుందన్నారు .క్లినిక్ లు, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్స్, అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రాలు (ఫైర్ ఎన్ ఓ సి), బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్, వైద్యులు, వైద్య సిబ్బంది ,ఆసుపత్రులపై దాడులు వంటి ఎన్నో విషయాలలో వైద్యులు ఎన్నో సమస్యల్ని ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. రాష్ట్ర ఐఎంఏ ఈ సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తుందని, రాష్ట్రంలోని అన్ని ఐఎంఏ శాఖలు, రాష్ట్ర శాఖకు సంపూర్ణంగా సహకరిస్తేనే విజయం సాధించగలమన్నారు. ఆ విషయంలో గుంటూరు శాఖ రాష్ట్ర శాఖకు వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గుంటూరు శాఖ నిర్వహించిన అన్ని కార్యక్రమాలకు సభ్యులు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ టి సేవ కుమార్ కోరారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ బి .సాయి కృష్ణ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో ఐఎంఏ నిర్వహించిన కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిచ్చాయని ,ఈ సంవత్సరం కూడా అదే ఉత్సాహంతో మరిన్ని వైద్యుల ,ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు .అందుకు వైద్యులందరూ సహకరించాలని కోరారు. సభలో 2025 -2026 ఐఎంఏ గుంటూరు శాఖ నూతన కార్యవర్గంకు ఎన్నికైన అధ్యక్షులు డాక్టర్ టి. సేవ కుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్ మోపర్తి శివప్రసాద్, కార్యదర్శి డాక్టర్ బి .సాయికృష్ణ ,సంయుక్త కార్యదర్శి డాక్టర్ చిలకల శ్రీనివాసరెడ్డి మరో 25 మంది కార్యవర్గ సభ్యుల చేత రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ సుబ్బారాయుడు ,నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన అధ్యక్షులు డాక్టర్ టి .సేవ కుమార్ కు ఐఎంఏ మెడల్ అందించి బాధ్యతలు అప్పగించారు .ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం చేసిన జీఎంఏ హాల్ ను అధిక సంఖ్యలో పాల్గొన్న ఐఎంఏ సభ్యుల హర్షద్వానాల మధ్య ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ ప్రారంభించారు .కార్యక్రమంలో ఐఎంఏ డాక్టర్ ఎన్ అప్పారావు ఫ్యామిలీ సెక్యూరిటీ స్కీమ్ చైర్మన్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగళ్ళ కిషోర్ , జిఎంఏ కార్యదర్శి డాక్టర్ జి రాజేష్ , సీనియర్ వైద్యులు డాక్టర్ సిహెచ్ విశ్వేశ్వరరావు, డాక్టర్ ఎం ఫర్ని కుమార్, డాక్టర్ మద్దినేని జగదీష్, డాక్టర్ కళాధర్, డాక్టర్ రవిబాబు ,డాక్టర్ శేషయ్య, డాక్టర్ అమర్నాథ్ ,డాక్టర్ అమర్ లింగేశ్వరరావు ,డాక్టర్ రాధికా రాణి , డాక్టర్ జి బాబురావు, డాక్టర్ ఐవిఎల్ నరసింహారావు ,అధిక సంఖ్యలో నగర వైద్యులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఒకరు హత్య





**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:** పట్టణ సమీపంలో బుధవారం రాత్రి మృతుడు కొమ్ము సంతోష్ రావు, నిందితుడు షేక్ సుభానీ లెనిన్ నగర్ నుంచి మద్యం కొనుగోలు చేసి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న ఏకాంత ప్రాంతంలో ఉన్న పాడుబడిన ఇంటికి వెళ్లారు. ఇద్దరూ కలిసి మద్యం సేవించిన తరువాత, మృతుడు తన అలవాటు ప్రకారం, నిందితుడు సుభానీని తనతో లైంగిక సంబంధం పెట్టుకోమని, కోరిక తీర్చమని కోరాడు. సుభానీ నిరాకరించడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సుమారు 11గం ల సమయంలో ఈ గొడవలో సుభానీ తన స్నేహితుడు, నిందితుడు నెం.2 నూర్బాషా సైదావలిని సంఘటనా స్థలానికి పిలిపించాడు. సైదావలి వచ్చిన తర్వాత నిందితులిద్దరూ మృతుడిపై రాళ్లతో దాడి చేయడంతో సంతోష్‌రావు మృతి చెందాడు. అనంతరం నిందితులిద్దరూ రక్తపు మరకలతో పిడుగురాళ్ల పట్టణంలో తిరుగుతుండగా పోలీసు, బీట్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా పై వాస్తవాలు వెలుగులోకి వచ్చాయిఅని పోలీసులు మీడియాకు తెలియ జేశారు.అనంతరం మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గురజాల మార్చురికి తరలించారు.